సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 2 । జూన్ । 2024



శ్రీ ఆంజనేయం

జిల్లా వ్యాప్తంగా హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో



అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

కాశీబుగ్గలో మాక్‌డ్రిల్ అబ్బురపరిచింది. పోలీసులు విన్యాసాలతో అవగాహన కల్పించారు. - 8లో

కవితానిలయం సంస్థకు 75 కవితా సంపుటాల పుస్తకాలు

శ్రీకాకుళం కల్చరల్: కథా నిలయంలో అదనంగా ఉన్న కవితా పుస్తకాల్లో 75 కవితా సంపుటాల పుస్తకాలను కవితా నిలయం సంస్థ కు కథానిలయం ట్రస్టు ప్రతినిధి కాళీపట్నం సుబ్బారావు శనివారం అందజేశారు. ఈ వేమన కవితా నిలయం వ్యవస్థాపకులు మహ్మద్ రఫీ (ఈ వేమన) కోరిక మేరకు వివిధ కవుల నుంచి జాలు వారిని కవితా సంపుటాలను వితరణ చేశారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: మండలంలో తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన వారితో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 2023 ఆగస్టు 31వ తేదీకి 15 నుంచి 22 ఏళ్ల లోపు వయసు ఉండాలని, 2022 ఆగస్టు 31వ తేదీ నుంచి 2009 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించి ఉండాలన్నారు. గ్రామీణ, మున్సిపాలిటీల్లో ఇంగ్లిష్ మీడియంలో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 20వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా 9705209418 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒక విద్యార్థి.. తొమ్మిది మంది సిబ్బంది



టెక్కలి రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం సంస్కృతం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఒకే ఒక విద్యార్థి హాజరయ్యాడు. పరీక్ష నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్ యు.గణపతిరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా బి.శేషగిరిలు విధులు నిర్వర్తించగా వారితో పాటు ఒక ఇన్విజిలేటర్, ఇద్దరు ఆరోగ్య సిబ్బంది, ఒక క్లర్క్, ఇద్దరు ఆయాలు, పోలీస్ కానిస్టేబుల్ మొత్తం కలిపి 9 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. గడిచిన వారం రోజులుగా జరుగుతున్న ఈ పరీక్షలు శనివారంతో ముగియగా అధిక శాతం మంది విద్యార్థులు గైర్హాజరు కావడం గమనార్హం.

రిమ్స్ న్యూరో విభాగం హెచ్‌ఓడీగా డాక్టర్ సీహెచ్ సురేంద్రకుమార్



డాక్టర్ సీహెచ్ సురేంద్రకుమార్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ న్యూరో వైద్య కళాశాలలోని న్యూరాలజీ విభాగం అధిపతిగా డాక్టర్ సురేంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. నెల్లూరులో న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న ఆయనను శ్రీకాకుళంకు పదోన్నతిపై బదిలీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రిమ్స్‌లో న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పార్వతి



డాక్టర్ డి. పార్వతి

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ డి.పార్వతిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆమె గైనికాలజీ విభాగంలో హెచ్‌ఓడీగా వ్యవహరిస్తున్నారు. శనివారం ఆమె సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ స్వామినాయుడు పదవీ విరమణ చేయడంతో డాక్టర్ పార్వతిని నియమించారు.

అర్ధరాత్రి గాలుల అలజడి



పీఎన్ కాలనీ 2వ లైన్‌లో శుక్రవారం అర్ధరాత్రి వీచిన గాలులకు వాహనంపై కూలిన చెట్టు

అరసవల్లి:

జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి భీకర గాలులు, వాన అలజడి రేపాయి. గాలుల తీవ్రత అధికంగా ఉండడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు కొంతమేరకు నష్టం వాటిల్లింది. చెట్లు నేరుగా విద్యుత్ స్తంభాలపై కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రధానంగా జిల్లా కేంద్రంలో పీఎన్ కాలనీ, పాలకొండ రోడ్డు, డేఅండ్‌నైట్‌కూడలి, బొందిలీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు ఒరిగిపోయాయి. విద్యుత్ వైర్లపై పడిపోవడంతో వైర్లు తెగిపడ్డాయి. అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు కూడా విద్యుత్ వైర్లపై పడటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అర్ధరాత్రి సమయంలో వర్షం తగ్గినప్పటికీ భారీగా గాలులు వీయడంతో వెంటనే నగరంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. అయితే శనివారం ఉదయం నుంచి పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేసినట్లుగా ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. అయితే పీఎన్ కాలనీ తదితర చోట్ల శనివారం మధ్యాహ్నం వరకు కూడా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు.



జిల్లా కేంద్రంలో విద్యుత్ వైర్లపై పడిన ఫ్లెక్సీని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

గాలివాన బీభత్సం

మెళియాపుట్టి: మండలంలోని నందవ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సంలో గ్రామానికి చెందిన సవర పెద్ద సొంబురు, సవర అప్పన్న, సవర చినబాబులకు చెందిన రేకిళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్లలో ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. కొంత మేర నగదు తడిసిపోయినట్లు బాధితులు తెలిపారు. అర్ధరాత్రి వేళ గాలివాన సమయంలో పక్కవీధిలోకి వెళ్లిపోవడంతో ప్రాణాలు కాపాడుకున్నామని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



నందవలో గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

పిడుగు పాట్లు

సోంపేట: మండలంలో శుక్రవారం రాత్రి పిడుగులు పడడంతో ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయాయి. శుక్రవారం రాత్రి వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. రాత్రి కావడంతో ప్రాణనష్టం తప్పింది. మండలంలోని పలాసపురం గ్రామంలో ఇంటిపై పిడుగు పడడంతో ఇల్లు దెబ్బతింది. పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. సోంపేట పట్టణంలో పిడుగులు పడడంతో పలు కుటుంబాలకు చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయినట్లు పలువురు తెలిపారు.



పాలకొండ రోడ్డులో అడ్డంగా స్తంభంపై పడిన చెట్టు

మూగ జీవాలు మృతి

కంచిలి: మండలంలోని జెన్నాగాయి, ఎక్కల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పిడుగు పాటుకు గురై మూగజీవాలు మృతిచెందాయి. జెన్నాగాయి గ్రామానికి చెందిన నల్లాన భాస్కరరావుకు చెందిన ఆవు పిడుగు పడటంతో మృతిచెందింది. ఎక్కల గ్రామంలో నెయ్యిల కాశీ బెహరాకు చెందిన పొలంలో కవిటి మండలం కొండిపుట్టుగ గ్రామానికి చెందిన కోరాడ తరిణయ్య ఆవులు మంద వేశాడు. శుక్రవారం పడిన పిడుగులకు పొలంలో ఉన్న మూడు ఆవులు, ఒక దూడ మృతి చెందాయి.

కంచిలి: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్ వి.జగదీష్ శనివారం తెలిపారు. పిడుగు పడి కాలేజీ విద్యుత్ మీటర్, కంప్యూటర్లు, ఇన్వర్టర్, వైర్లు, సీపీయూ ప్రాసెసర్ మొదలైనవి పాడవ్వడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం పంపినట్లు తెలిపారు.



కంచిలి: ఎక్కల గ్రామం పొలంలో పిడుగు పాటుకు మృతిచెందిన ఆవులు, దూడను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శిరీష



గుజరాతీపేటలో రోడ్డుపైకి చేరిన వరద నీరు

విద్యుత్ అంతరాయాలు ఉండకూడదు

- తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్

అరసవల్లి: జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ఎక్కడా అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించారు. ఆయన శనివారం జిల్లాలో జరుగుతున్న పలు పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఈనెల 4న శివానీ కాలేజీలో ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఈ కృష్ణమూర్తిని ఆదేశించారు. అనంతరం రూరల్ మండలం పాత్రునివలస (టిడ్కో)లో ఆర్‌డీఎస్‌ఎస్ కింద నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులను, డిమాండ్ మేరకు అందిస్తున్న సప్లై వివరాలను సర్కిల్ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి సీఎండీకి వివరించారు. అలాగే ఈ సబ్‌స్టేషన్ వినియోగంలో భాగంగా ఇంకా ఎంత మేరకు లోడ్ షేరింగ్ చేయవచ్చో అన్న వివరాలపై సీఎండీ ఆరా తీశారు. తీవ్రమైన పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యుత్ అంతరాయం ఉండకూడదని సీఎండీ ఆదేశించారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల రోడ్డులో సుమారు రూ. 2.50 కోట్లతో నిర్మించిన ఎంఆర్‌టీ, స్టోర్స్ భవన సముదాయాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన వెంట ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్సు డైరెక్టర్ సూర్యప్రతాప్, ఫైనాన్స్ అండ్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ చంద్రం, ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, ఎంఆర్‌టీ ప్రొటెక్షన్ ఏడీఈ యోగేశ్వరరావు, ఏడీఈ చల్లా వెంకటేశ్వరావు, టౌన్ ఏడీఈ రాంబాబు, డి-2 ఎఈ జె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాత్రునివలస సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

కౌంటింగ్ నిర్వహణపై సమీక్ష



కౌంటింగ్ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహణ పక్కాగా ఉండాలని కలెక్టర్, ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద ఓట్ల లెక్కింపు, భద్రతపై శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు, భద్రతపై అధికారులతో సమీక్షించారు. పక్కాగా కౌంటింగ్, ఈవీఎంలు తరలింపుపై అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ నవీన్, ఆర్వోలతో సమీక్షించారు.



పకడ్బందీ ప్రణాళిక

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల తుది ఫలితాలు వెల్లడించే రోజున అమలు చేయాల్సిన ప్రణాళికలపై ఎస్పీ జీఆర్ రాధిక పలు సూచనలు చేశారు. ఆ రోజున ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు హాజరయ్యే కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లకు జిల్లా పోలీసు శాఖ తరపున పలు సూచనలు చేస్తూ శనివారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

- సిబ్బంది, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఎన్‌హెచ్-16 రోడ్డుపై కింతలి మిల్లు జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి అండర్ ఫ్లైఓవర్ కింద నుంచి వెళ్తూ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ మీదుగా అంబేడ్కర్ యూనివర్సిటీ మీదుగా శివానీ కళాశాల దగ్గరలో గల అండర్ ఫ్లై ఓవర్ వద్దకు చేరాలి.
- శివానీ కాలేజీ దగ్గరలో గల అండర్ ఫ్లైఓవర్ వద్ద పోటీ చేసే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది గుర్తింపు పత్రాలు తనిఖీ చేశాక వారిని కాలేజీ లేఅవుట్ మీదుగా పార్కింగ్ ప్రదేశం వద్దకు అనుమతిస్తారు.
- ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ మీదుగా చిలకపాలెం వైపునకు హెవీ వెహికల్స్ అనుమతించరు. సాధారణ ప్రయాణికుల వాహనాలు కాలేజీ దగ్గరలో గల అండర్ ఫ్లైఓవర్ వద్ద నుంచి చిలకపాలెం వైపునకు సర్వీస్ రోడ్డులో ఆపోజిట్ సైట్‌లో వెళ్తాయి.
- శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు గేట్ నంబర్-1 నుంచి వెళ్లి ఫార్మసీ బ్లాక్ కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరుకోవాలి.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది గేట్ నంబర్ 2 నుంచి వెళ్లి నంబర్ 111- టి బ్లాక్ కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరాలి.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన పోటీ చేసే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు గేట్ నంబర్ 3 నుంచి వెళ్లి 111-టి బ్లాక్ కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరాలి.
- కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు చెందిన వాహనాలను గేట్ నంబర్ 2 దాటిన తర్వాత గల లేఅవుట్ వద్ద వేర్వేరుగా వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలి.

అధికారులకు దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల నాలుగో తేదీన అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, చేపట్టాల్సిన బాధ్యతలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శనివారం మధ్యాహ్నం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనలో ఎక్కడా అలసత్వం వహించకుండా, పూర్తి పారదర్శకతతో పనిచేస్తూ, ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కౌంటింగ్‌కు 24 గంటల ముందు చేయాల్సిన పనులను ఎన్నికల సంఘం సూచనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలన్నారు.

రెడ్‌జోన్ పరిధిలో పటిష్ట భద్రత

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శివానీ కళాశాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఓట్ల లెక్కింపు రోజు భద్రత చర్యలపై ఎస్పీ జీఆర్ రాధిక శనివారం పోలీసు అధికారులతో సమీక్షించారు. మొత్తం రెండు కిలోమీటర్ల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలు పరిశీలించి సూచనలు చేశారు. జనాలు గుమిగూడకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్య లేకుండా తీసుకునే చర్యలపై దిశానిర్దేశం చేశారు. అల్లర్లు సృష్టించే వారిని తక్షణం వాహనాల్లో ఎక్కించి తరలించేందుకు పికప్ వాహనాలు సిద్ధంగా ఉంచుతున్నట్లు వివరించారు. ఏజెంట్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, రిటర్నింగ్ అధికారి అనుమతితో మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు పంపించనున్నట్లు చెప్పారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా ఆల్కహాల్ టెస్ట్ సైతం చేస్తామని అన్నారు. ఏజెంట్లు, అభ్యర్థుల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు కేటాయిస్తున్నట్లు వివరించారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ రాధిక

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పాతపట్నం: పాతపట్నం సబ్‌జైల్‌లో ఉంటున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పాతపట్నం సబ్‌జైల్‌ను, పాతపట్నం కోర్టు జడ్జి మానెన్ రోషిణితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా శిక్ష పడిన దోషులకు న్యాయవాదులు ఉన్నారా లేదా అన్న అంశంపై అక్కడి జైలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జైలు రికార్డులను పరిశీలించారు. వంటగదులు, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాదులు పీఈ సత్యనారాయణ, ఎం.రామారావు, జి.ఫల్గుణరావు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది, జైల్ సిబ్బంది శ్యామ్, రవి, పాల్గొన్నారు.



సబ్‌జైల్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

91.57% పింఛన్ల పంపిణీ



గుజరాతీపేటలో వృద్ధురాలు అన్నపూర్ణకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి రఘునాథ్

శ్రీకాకుళం పాత బస్టాండ్: సామాజిక భద్రత పింఛన్లను తొలిరోజు 91.57 శాతం మందికి పంపిణీ చేశారు. జిల్లాలో 3,19,702 మందికి గాను 2,38,993 పింఛన్లను నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మిగిలిన 80,709 పింఛన్లకు గాను తొలిరోజు శనివారం గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది 73,902 పింఛన్లను పంపిణీ చేశారు.

ఎక్స్‌లెన్స్ అవార్డులు



ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రా పోస్టల్ సర్కిల్ విశాఖపట్నంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్కిల్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానాన్ని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌కు ఎనిమిది అవార్డులు లభించాయి. చిన్న పొదుపు ఖాతాల ప్రారంభం, గ్రామీణ తపాలా జీవిత బీమా, పోస్టల్ లైఫ్ బీమాకు సంబంధించి టి.అమ్మన్నాయుడు, సబ్ డివిజన్ స్థాయిలో ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించినందుకు వై.ఇంద్రసేన, కాశీబుగ్గ సబ్ డివిజన్‌కు అవార్డులు లభించాయి. బీపీఎం స్థాయిలో యు.దూదమ్మ, ఈదుపురం, పోస్టల్ ఖాతాలకు సంబంధించి ఇద్దరు డైరెక్ట్ ఏజెంట్లు శ్రీదేవి, వాణిలకు అవార్డులు లభించాయి. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన అందరినీ సత్కరించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయాలి
- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ వెల్లడి

అరసవల్లి:

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో విజయ మాట్లాడుతు గ్రామీణ నీటి సరఫరా, ఏపీఈపీడీసీఎల్, వ్యవసాయ శాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్యశాఖల ద్వారా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, ఆయా శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

సుజలధార నుంచి మంచినీరు

వైఎస్సార్ సుజలధార పేరుతో ప్రారంభమైన ఉద్దానం మంచినీటి పథకం పూర్తిస్థాయిలో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఏ చిన్న పొరపాటుకు తావివ్వరాదని పిరియా విజయ స్పష్టం చేశారు. జిల్లాలో లోటల్టేజ్ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల కాలంలో 1459 పనులు చేపట్టామని, కొత్తగా ఏడు సబ్ స్టేషన్‌లను నిర్మించామని పేర్కొన్నారు. పలువురు సభ్యులు లేవనెత్తిన సబ్ స్టేషన్ల స్థలాల ఆక్రమణలపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధి కారి కె.శ్రీధర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను 1.70 లక్షల హెక్టార్లలో పంటలు పండించేందు కు ప్రణాళికలు రూపొందించామని, దాదాపు 36 వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్వర్ణ 1318 రకం, 1224 రకం ధాన్యం విత్తనాలను ఈసారి అధికంగా పంపిణీ చేస్తామని, స్టాక్ పాయింట్లను సిద్ధం చేశామన్నారు.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

33 సగటు పనిదినాల కల్పన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 33 రోజుల సగటు పని దినాలు కల్పించామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిరాజు తెలిపారు. ఆ శాఖపై జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జోరుగా పనులు చేపడతామని, అందుకు తగ్గ ప్రణాళికను సిద్ధం చేసినట్టు చెప్పారు. 2025 మార్చి నాటికి జిల్లాలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ 75 రోజుల కనీస పని దినాలను కల్పిస్తామని ఒక ప్రశ్నకు ఆయన సమాధానంగా పేర్కొన్నారు. జిల్లాలోని 1.55 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్యం

వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో భాగంగా జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా అవసరమైన వారికి అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సైతం జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయని, జూన్ నెలలో మలేరియా కేసులు, జూలైలో డయేరియా కేసులు నమోదవుతుంటాయని, వీటికి చెక్ పెట్టేందుకు తగిన ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలాగా, నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్లు సిరిపురపు జగన్, పాలిన శ్రావణి, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మలకాంలో ఉపాధి హామీ సంబరాలు



భోజనాలు చేస్తున్న వేతనదారులు

పొందూరు: మండలంలోని మలకాం గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులు ఉపాధి హామీ సంబరాలను శనివారం నిర్వహించారు. కూని చెరువులో 80రోజులు పని దినాలు పూర్తి కావడంతో సంబరాలు జరుపుకున్నారు. వేతన నగదు పూర్తి స్థాయిలో రావడంతో ఆనందంగా గడిపారు. ఏటా ఇక్కడ ఉపాధి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పంక్తి భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు.

1800 లీటర్ల సారా ఊట ధ్వంసం



నేలబొంతు గ్రామంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు శనివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ నేరమని, గిరిజన యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. దాడుల్లో పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్‌నాయుడు, ఎస్ఈబీ ఎస్ఐ గణేష్ పలువురు సిబ్బంది ఉన్నారు.

అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

మాక్‌డ్రిల్‌తో పోలీసులు అబ్బురపరిచారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులు ఎలా ప్రతిస్పందిస్తారో కళ్లకు కట్టినట్టు చూపించారు. కాశీబుగ్గ బస్టాండ్ వద్ద శనివారం నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్‌ను చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఏ పార్టీకి చెందినవారైనా, అల్లరమూకలైనా, రౌడీలైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు కాశీబుగ్గ సీఐ విజయానంద్, ఫైర్ ఎస్ఎఫ్ఓ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– కాశీబుగ్గ



టైర్లు కాల్చి మంటలు రేపుతున్న నిరసన కారులు



మంటలను అదుపుచేసేందుకు వాడుతున్న ఆక్వా ఫిల్మ్ ఫార్మింగ్ ఫోం



హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



మాక్‌డ్రిల్‌లో భాగంగా రబ్బర్ బుల్లెట్ తగిలిగాయమైన వ్యక్తి, అత్యవసర సేవలకు తరలిస్తున్న వైనం (డెమో)

కారు బోల్తా.. ప్రయాణికులు సురక్షితం



అదుపుతప్పి బోల్తాపడిన కారు

నరసన్నపేట: దేవాది వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఒక కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నర్సీపట్నంకు చెందిన ఎస్.జగన్నాథం తన భార్య, కుమారుడు మనోహర్‌లు ఇచ్ఛాపురం వెళ్లారు. అక్కడ కోడలిని తీసుకుని కారులో శ్రీకాకుళం వస్తున్నారు.

దేవాది వద్దకు వచ్చే సరికి కారు నడుపుతున్న జగన్నాథం కళ్లు ఒక్కసారి మూత పడ్డాయి. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డ్రైనులో బోల్తా పడింది. వెంటనే స్థానికులు కారులో ఉన్న నలుగురినీ బయటకు తీశారు. మనోహర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురూ సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు వచ్చి కారును బయటకు తీయించారు.

అనుమతి లేకుండా సభ నిర్వహణ



రూరల్ ఎస్ఐ వాసుదేవరావుతో వాదిస్తున్న జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో 150 మందికి పైగా ఉద్యోగ సంఘాల నేతలు రౌండ్ టేబుల్ సమావేశానికి సిద్ధమవ్వగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే రాజకీయ ప్రమేయం లేని తమ ఉద్యోగుల సమావేశాన్ని పోలీసులు అడ్డుకోవడం పద్ధతి కాదంటూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘ ఐక్యవేదిక (జేఏసీ) చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉండడంతో అనుమతి లేకుండా సభ నిర్వహించడం సరికాదని పోలీసులు అడ్డుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశం ఆగిపోవడంతో హోటల్ ఎదురుగా ఓ అరగంట సేపు పోలీసులు, ఉద్యోగ సంఘాల మధ్య వాగ్వాదం జరగడం గమనార్హం.

పాముకాటుతో బాలుడి మృతి



శ్రీరామ్ పాణిగ్రాహి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కంచిలి: మండలంలోని బొగాబెణి గ్రామానికి చెందిన శ్రీరామ్ పాణిగ్రాహి(13) పాముకాటుతో మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం.. శ్రీరామ్ పాణిగ్రాహి స్వగ్రామం ఒడిషా కళింగ్‌దళ్ గ్రామం. బొగాబెణిలో ఉన్న తాతగారు బసంత్‌కుమార్ రాణా ఇంట్లో ఉంటూ స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మే 30వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా, అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పాము మెడమీద ఎడమ వైపు కాటేసింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 24 గంటల తర్వాత మృతిచెందాడు.

దేశ రాజధానిలో కర్తలి యువకుడికి సత్కారం



ఢిల్లీలో సినీ సంగీత విభావరిలో నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంటున్న పైల వినయ్‌కుమార్

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన పైల వినయ్‌కుమార్‌కు దేశ రాజధాని న్యూ ఢిల్లీలో అరుదైన గౌరవం దక్కింది. శుక్రవారం రాత్రి ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్‌లో ఆదిలీలా ఫౌండేషన్ వారు నిర్వహించిన సినీ సంగీత విభావరిలో యువకుడు పాల్గొని మంచి ప్రతిభ కనబర్చాడు. దీంతో కార్యక్రమం నిర్వాహకులు వినయ్‌కుమార్‌కు బహుమతి ఇచ్చి సత్కరించారు.

శ్రీ ఆంజనేయం



పుణ్యపువీధిలో ఆంజనేయ స్వామి



పుణ్యపువీధిలో మామిడి, గారెలతో అలంకరణ



శ్రీకాకుళంలో వ్రతాలు చేస్తున్న మహిళలు

హనుమద్ జయంతి సందర్భంగా ఊరూవాడా శనివారం హనుమంతుని సేవలో గడిపాయి. ప్రత్యేక పూజలు చేసి వ్రతాలు ఆచరించారు. స్వామిని అరటి, మామిడి పళ్లతో పాటు గారెలతో అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అమ్మవారికి రూ.5.75 లక్షల బంగారు హారం వితరణ



నీలమణిదుర్గమ్మ అమ్మవారి మెడలో వేసిన బంగారు హారం

హిరమండలం: మేజర్ పంచాయతీలోని పెద్ద కోరాడవీధి వద్ద ఉన్న పాతపట్నం నీలమణిదుర్గమ్మకు శ్రీకాకుళం చెందిన అమ్మవారి భక్తుడు రూ.5.75 లక్షల విలువైన ఏడు తులాల బంగారు హారాన్ని వితరణగా అందించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులకు పుల్లా రవణ, పుల్లా రాఘవరావు, బత్తుల వెంకటరమణలు అందజేశారు. భక్తితో చేసిన విరాళమని, ప్రచారం చేయద్దని దాత చెప్పడంతో దాత పేరును అర్చకులు, కమిటీ సభ్యులు గోప్యంగా ఉంచామని తెలిపారు.


మెగా ఎక్స్‌పోకు విశేష స్పందన



ఖాతాదారునికి మంజూరు చేసిన రుణం చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని సింహద్వారం వద్దనున్న వెంకటాపురం రీజనల్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన మెగా ఎక్స్‌పో–2024 కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ వైజాగ్ జోనల్ హెడ్ షాలినీ మెనోస్ మాట్లాడుతూ ఈ మెగా ఎక్స్‌పోకు ఔత్సాహిక వ్యాపారులు, స్థానిక ప్రజలు వచ్చి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్‌గా ఉందని, ఖాతాదారులకు సేవలు అందించడంలో యూనియన్ బ్యాంక్ ముందంజలో ఉందన్నారు. బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రుణమేళాలో వివిధ బ్రాంచిల నుంచి వచ్చిన ఖాతాదారులకు తక్షణమే రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ మాట్లాడుతూ అర్హత కలిగిన ఖాతాదారులకు వెంటనే రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఎక్స్‌పోలో రూ.8కోట్ల గృహ, వాహన, విద్య, వ్యక్తిగత రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే రూ.14కోట్ల విలువైన రుణాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్‌లు రవి, సుభనారాయణ్, ఆర్ఎల్‌పీ హెడ్ చైతన్య, బ్రాంచి మేనేజర్‌లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్–2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ర్యాంకు ఆధారంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ మే 27 తేదీ నుంచి కొనసాగుతుంది. సహాయక కేంద్రంలో శనివారం 75001 నుంచి 92000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 252 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 210 బీసీ, ఓసీ, 42 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. మే 27 నుంచి ఇప్పటి వరకు కౌన్సెలింగ్‌కు 1796 మంది హాజరయ్యారు. ఆదివారం 92001 నుంచి 108000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. షెడ్యూల్ మేరకు ఆదివారం వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మూడో తేదీన జరగాల్సిన కౌన్సెలింగ్ సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు నేపథ్యంలో ఆరో తేదీకి వాయిదా పడింది. 7 నుంచి 10 వరకు ఆప్షన్ల ఎంపిక, 11వ తేదీన ఆప్షన్ల మార్పు, 13న అలాట్‌మెంట్‌ల ప్రకటన, 14 నుంచి 19 మధ్య కళాశాలలకు సీట్లు లభించిన విద్యార్థుల రిపోర్టింగ్, 14 నుంచి మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

సింగుపురం హుండీ అక్రమంపై విచారణాధికారిగా సుధారాణి

అరసవల్లి: సింగుపురం కొండపై గల హటకేశ్వర స్వామి వారి ఆలయ హుండీ అక్రమంగా తెరిచిన వ్యవహారంపై విచారణాధికారిగా అనకాపల్లి జిల్లా దేవదాయ శాఖాధికారి కేఎల్ సుధారాణిని నియమిస్తూ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 24న సింగుపురం కొండపై ఉన్న శ్రీ హటకేశ్వరస్వామి జాతర అనంతరం అనధికారికంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అక్కడి గ్రూప్ టెంపుల్స్ ఈఓ, శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ స్వయంగా హుండీ తెరిచిన ఘటన సంచలనమైన సంగతి విదితమే. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైన క్రమంలో ఈఓ వెంకటరమణను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డిప్యూటీ కమిషనర్ సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. అనంతర ప్రక్రియగా శాఖాపరంగా విచారణ కోసం డీఈఓ సుధారాణిని తాజాగా నియమించారు.

ప్రాథమిక విచారణగా జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ ఇప్పటికే డీసీ కార్యాలయానికి తన నివేదికను అందజేశారు. దేవదాయ శాఖలో అనధికారికంగా ఇలాంటి చర్యలకు పాల్పడిన ఈఓలు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని తెలుస్తోంది.